# దౌష్ట్యఫలము

శ్రీమతి కామరాజు మైత్రేయిగారు

సముద్రము, గాలి కూడ నిశ్చలముగా నున్నవి. సముద్రములోవున్న పడవ బొమ్మ వలె నిలచిపోయినది. గాలి వున్నకదా పడవ కదలుట.

చడి చప్పుడుకాక, పడుచున్నవి అలలు, సముద్రములో కొండమీద అలలు కొద్దిగ లేచి కొద్దిగ పడుటవలన, ఆకొండకు కట్టిన గంట కదులుటలేదు.

ఆతీరాన్నే బసచేసుకున్న ఒక వృద్ధ సన్యాసి, నావికుల వుపయోగార్థము కట్టినాడు ఆగంట. అది తెప్పమీద తేలుచుండును. అలల తాకుడువలన గంట మ్రోగుచు దానిపనిని అది నెరవేర్చుచుండెను. వర్షాకాలము, తుపాను సమయములందు తెప్ప, గంట కనుపించకపోయినా, నావికులు యీ గంటను విని వారి పడవలను ఆగాధమైన ఆకొండను తప్పించెడివారు.

ఆత్రోవను నడచు నావికులు యీ సహాయమునకు, ఆవృద్ధ సన్యాసిని సదా తలచుచు, వారి కృతజ్ఞతను తెలుపుచుండిరి.

అది మంచి వుల్లాసమైన రోజు ప్రాణివర్గమంతయు చాల తృప్తిగాను, సంతోషముగాను వున్నది. సముద్రముమీద ఎగురు పక్షులలో, కూజితములందు కూడ, ఒక విధమగు సంతోషము కనబడుచుండెను.

సముద్రపు దోపిడిగాడగు రాముడు విలాసార్థము వాహ్యాళి బయలుదేరినాడు సముద్రములో యీతెప్ప చుక్కవలె స్పష్టముగా కనుపించుచుండెను. రామునిలోకూడ వుల్లాసము పుట్టినది. వాడు చాల ఆనందముగ వున్నాడు. కూని రాగములు తీయుచున్నాడు. కాని వాని వుల్లాసము క్రూరమైనది.

వాని దృష్టి ఆతెప్పమీదకు మరలినది. తోటి నావికులతో "ఓరి మన పడవను ఆ గంట యొద్దకు నడపవలెను. నేను వృద్ధ సన్యాసి పని పట్టెదను." అని చెప్పినాడు.

వాని నావికులు పడవను రాముని యిష్టానుసారము తెప్పయొద్దకు నడపినారు. రాముడు తన పడవలోనుండి వంగి తెప్ప నుంచి ఆగంటను వేరుచేసినాడు.

గంట అస్ఫుటమైన మ్రోతతో మునిగి పోయినది. నీటి బుడగలు బయలుదేరి అణగి పోయినవి. మరల ఎప్పటియట్ల అలలు లేచుచు పడుచున్నవి. "ఆహా యింక యీ త్రోవనునడచు మొదటినావికుడు యీసన్యాసిని తలవడు" అన్నాడు రాముడు ఆనందముతో.

రాముడు ఎన్నోమైళ్లు ప్రయాణముచేసి దోపిడివలన డబ్బు బాగుగసంపాదించి యింటి ముఖము పట్టినాడు.

ఆకాశమంతటను దట్టముగా మబ్బుపట్టినది. పైన సూర్యుడు కనుబడుటలేదు.

ప్రొద్దున్నంతయు గాలి హోరునలేచి సాయంకాలమునకు పడిపోయినది. రాముడు పడవలో నిలబడినాడు. చుట్టుపట్టంతయు చీకటి క్రమ్మి ఎక్కడ తీరము కనబడుటలేదు.

"త్వరలోనే వెలుగువచ్చును. చంద్రుడుదయించు జాడలు కనుపించుచున్నవి." అనినాడు రాముడు.

"అలల విరుగుడు వినబడుటలేదా? మనము తీరముదరినే వున్నట్లున్నది. కాని మనమెక్కడనున్నామో తెలియుటలేదు. అయ్యో, ఆకొండవద్ద గంట మ్రోగిన ఎంతో బాగుండుననిపించుచున్నది." అని చెప్పినాడు వారిలోనొకడు. వారికీ మ్రోతయు వినబడుటలేదు. సముద్రపుహోరు మాత్రము చాల ఎక్కువగనున్నది. గాలి లేకపోయినను ఎట్లో పడవను నడపుచున్నారు.

ఇంతలో పెద్ద శబ్దము!! పడవదేనినో గట్టిగ తాకినది. ఆతాకుడుతో నావికుల గుండెలు జల్లుమన్నవి. "అయ్యో ఆమాయదారి కొండయే" అని నావికులందఱు యేక కంఠమున పలికినారు.

రాముడు జుట్టు పీకికొనినాడు. తనను తాను శపించుకొనినాడు. ఆఅవస్థలో నలుప్రక్కలనుంచి అలలుచుట్టి పడవను ముంచివేసినవి. పడవ మునిగిపోవుచున్నది. మరణావస్థలోకూడ అస్ఫుటమైన ఆగంట శబ్దం వినుపించుచున్నది. రాముని చెవిలో యమకింకరులు, వాడు కోసివేసిన ఆగంటతోనే వాని చావుకు సంతోషించుచు ఆహ్వానించుచున్నట్లనిపించినది ఆఘాతకునికి!!

# పరమసుఖము

శ్రీమతి చర్ల సుశీలగారు

మలయశైలశీతల మందమారుతములు
సౌరభంబులజల్లెడు సమయమందు
ప్రకృతినర్తకి నాట్యముల్ సలుపుతరిని
పాటపాడుచు దుమ్మెదల్ వరలువేళ
చిలుకలును ముద్దుపలుకుల బలుకునపుడు
లలితశాఖలువంగి సలామునేయ
పశులకాపరితనముందు పశువులెల్ల
మేయుచుండగ నొకచెట్టు చాయయందు
బట్టబరచి హాయిగనట బండుకొనియు
వచ్చిరానిపదంబుల పాడుకొనుచు
గోయికోయను కోయిల కూతలకును
దిరిగి కోయని కూయుచు దేపదేప
నవ్వుకొనుచు మదిని మహానందమొందు
పశులకాపరిదే భువి బరమసుఖము.